సంవత్సరం (91) వర్షాకాలంలో మొదటిసారిగా అది ట్రబుల్ యివ్వడం ఆరంభించింది. మూడు నెలల్లోనే నాలుగైదు ముఖ్యమయిన పార్ట్స్ మార్పించినా వుపయోగం లేకపోయింది. మొదటిసారిగా ఆ బండి పాడవడంతో ఏదో పనిమీద వెళ్ళిన హాస్యప్రియ ఎడిటర్ శంకు (టి. వి. న్యూస్ రీడర్ శోభాశంకర్‌గారి భర్త) యింట్లో దాన్ని లాక్ చేసి ఆటోలో రావాల్సి వచ్చింది. మర్నాడు మెకానిక్ వాళ్ళింటికెళ్ళి తీసుకుని బాగుచేసి తెచ్చిన వారానికి మళ్ళీ ఓసారి దారిలో చెడిపోతే ఆదర్శనగర్ లోని ఓ ఫ్రెండ్ యింటిదాకా తోసుకెళ్ళి అక్కడ లాక్ చేసి వచ్చాను.

ఆ బండి కొన్నప్పటినించి దాని కార్బొరేటర్ క్లీన్‌చేసి సర్వీస్ చేసే మెకానిక్ చెప్పాడు దాన్ని అమ్మేయడం బెటర్ అని. అనేక సందర్భాల్లో నాకు చేదోడువాదోడుగా వున్న దాన్ని అమ్మబుద్ధి కాలేదు. కాని తప్పదు. చివరికి సెప్టెంబర్ రెండో వారంలో, దాన్ని కొన్న సరిగ్గా పది సంవత్సరాలకి ఏ. బి. ఎక్స్ 9570 రాజ్‌దూత్‌ని అమ్మక తప్పలేదు.

మరో రాజ్‌దూత్ కొన్నా అది మానసికంగా 9570 యిచ్చిన తృప్తి యివ్వలేదు నాకు. కొత్తది నా జీవితంలోంచి వెళ్ళిపోయిన ఓ ముఖ్యమయిన భాగానికి సరయిన భర్తీ కాదు కదా.

# అనాటమీ ఆఫ్ ఏన్ ఏజిటేషన్

లోడ్ చేసిన రివాల్వర్ ట్రిగర్‌ని లాగితే బుల్లెట్ ఎలా పేలుతుందో, గ్రెనేడ్‌పిన్‌ని లాగితే ఆ గ్రెనేడ్ ఎలా బద్దలవుతుందో అలాగే ఓ మనిషి కోలాహలాన్ని సృష్టిస్తే అది సమాజంలో మనుషుల్ని, లేదా పదవుల్లోని రాజకీయ నాయకుల్ని తాకి తీరుతుంది.

ఈ కోలాహలంకి అనేక పేర్లున్నాయి. సత్యాగ్రహం, బంద్, ఏజిటేషన్, మౌనవ్రతం, నిరాహారదీక్ష, ఘెరావ్, ధర్నా, రాస్తారోకో,

జైల్ భరో, రథయాత్ర, మతకల్లోలాలు, రయట్స్.... ఇంకా అనేకానేకం. రివాల్వర్ గుండుతో ఒక్కడే చస్తాడు. కాని ఈ కోలాహలంవల్ల కొన్నివేల లేదా లక్షల మంది బాధితులవుతారు. అయినా ఇది సృష్టించడం నేరంకాదు! అలాంటివారు నిర్దోషులే!!

సాధారణంగా ఈ కోలాహలంవల్ల దుకాణాల బంద్. దాంతో నిత్యావసర వస్తువులు దొరక్కపోవడం, దొరికినా వాటి ధరలు తాత్కాలికంగా ఆకాశాన్నంటడం, అమాయకులు కత్తిపోట్లకి గురవడం, పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ బస్‌లని తగులబెట్టడం, దాంతో అవి నడవకపోవడంతో వాటిమీద ఆధారపడే వారంతా ఇబ్బందులకి గురికావడం జరుగుతూంటాయి. ఇవన్నీ ఓ మనిషి సృష్టించే కల్లోలం తాలూకు కొన్ని సైడ్‌ఎఫెక్ట్స్ మాత్రమే. వీటిమీద రీసెర్చ్ చేస్తే ఖచ్చితంగా డాక్టరేట్ రాగలిగినంత సమాచారం మన దినపత్రికల్లో లభ్యమవుతుంది. ప్రపంచంలో మనదేశంలో తప్ప ఇంకే దేశంలో ఈ అంశంమీద అద్భుతమైన సమాచారం ఇంత విస్తారంగా లభ్యంకాదు.

వాయుగుండంవల్ల తీరాన్ని తాకే తుఫాను కలిగించేలాంటి నష్టాన్ని యిది తరచు కలిగిస్తున్నా ప్రభుత్వం తుఫాను బాధితులకి సహాయం ప్రకటించినట్లు ఈ రయట్స్ విక్టిమ్స్‌కి సహాయం ప్రకటించదు. ఎందుకని అడిగితే ఓ మాజీమంత్రి నవ్వుతూ చెప్పాడు.

'తుఫాను రెండు మూడేళ్ళకోసారి వస్తుంటుంది. కాని ఇవి రెండు మూడు నెలలకి వస్తూంటాయి. కాబట్టి బడ్‌జెట్ దీనికి సరిపోక.'

అసలు ఈ కల్లోలాలు ఎలా సృష్టించబడతాయి? అన్న అంశం మీద చిన్నసైజు రీసెర్చి చేస్తే నాకు చాలా సమాచారం దొరికింది. ప్రధానంగా చెప్పాలంటే యివి రెండు కారణాలవల్ల సంభవిస్తూంటాయి. ఒకటి రాజకీయం, రెండోది రౌడీయిజం. మూడోది ఈ రెంటి కలయిక. ఈ మూడు మించి నాలుగో కారణం అంటూ లేదు.

ఓ రివాల్వర్ పేల్చి ఒకర్ని లేదా ఓ గ్రెనేడ్ పేల్చి పదిమందిని ఎవరయినా చంపితే శిక్ష వున్న మన ప్రజాస్వామ్య దేశంలో, శిక్షలేని డెడ్‌లీ వెపన్ అయిన ఈ కోలాహన్ని ఎవరయినా సృష్టించవచ్చు.

ఎందుకయినా సృష్టించవచ్చు. కాని అందుకు ఎన్ని వందల లేక వేలమంది బలయినా దానికి బాధ్యతని వహించనవసరంలేదు. ఇలాంటి వాటిని రేకెత్తించడం ఓ కళ. మళ్ళీ మాట్లాడితే ఓ సైన్స్. ప్రభుత్వాలని పడగొట్టడానికి, ముఖ్యమంత్రులని, ప్రధానమంత్రులని మార్చడానికి, శతృవర్గాన్ని హతమార్చడానికి, ప్రజల్లో చీలికలు తీసుకురావడానికి. ఈ ఆర్గనైజ్డ్ క్రయిమ్స్‌ని రూపొందించే ఓ పెద్దమనిషి ఇటీవల రాజకీయ ప్రత్యర్థి లాయర్‌గారింట్లో పరిచయం అయాడు. తన గేంగ్‌లోని కొందర్ని పోలీసుల నించి విడిపించడానికి వచ్చాడా పెద్దమనిషి.

ఈ టెర్రరిజం, సేబటేజ్, గొరిల్లావార్ ఫేర్‌ల పూర్వాపరాల గురించి ఆసక్తికరమయిన విషయాలు అనేకం అయిన తెలిసాయి. వివిధ పాయింట్స్‌గా వీటిని వివరిస్తాను.

**పరికరాలు** : ఇలాంటి సనివేశాల్లో వుపయోగించే పరికరాలు అనేకం. వాటిలో ముఖ్యమయినవి కత్తులు, చాకులు, బాకులు. ఇవి మనిషిలోని ఫలానా భాగాన్ని కట్ చేయడానికి అనువుగా డిజైన్ చేయబడి వుంటాయి. ఆయువు పట్టయిన ఆ భాగం మీద వీటిని వుపయోగించగానే హాస్పిటల్‌కి చేరకుండా హరీమంటాడు ఆ విక్టిమ్. కర్రలు, లాఠీలు, చెయిన్లు, వైర్‌లు, సుత్తులు మనుషుల్ని చంపడానికయితే గొడ్డళ్ళు, గునపాల లాంటివి మూసివున్న షట్టర్‌లని తెరవడానికి, సినిమాహాళ్ళు, యిళ్ళు పగలగొట్టడానికి వినియోగిస్తారు.

**అవకాశాలు** : అనంతం. ప్రభుత్వం చేసే ఓ పాలసీ లేదా చట్టం (ఉదాహరణకి రిజర్వేషన్స్) మతానికి చెందిన ఏ అంశమయినా. ఇలా బహిరంగంగా అవకాశాలు లేకపోతే దళితుల మీద క్రౌర్యం లేదా ధరల పెరుగుదల లేదా యింకోటి లేదా మరోటి.

**మనుషులు** : వీటికి చెందిన మనుషుల్లో అనేక రకాలున్నారు. ఫలానా ఫలితం కావాలి అనుకున్న వ్యక్తి దాన్ని సాధించడానికి ఏజిటేషన్‌ని సృష్టించే ఓ ముఖ్యమయిన పెద్ద మనిషి అవసరం ఎంతో వుంది. ఇలాంటివారు మన రాష్ట్రంలో వందమంది దాకా వున్నా ఏక్టివ్‌గా పాల్గొనేది అందులో సగం మందేనని కొన్ని పూర్వ సంఘటనలు

సూచిస్తున్నాయి.

**మంత్రులు** : ఆ ఏజిటేషన్‌ని ప్లేన్ చేసే మనుషులని మంత్రులుగా పేర్కొనవచ్చు. పథకం వేయబడ్డ ఆ ఏజిటేషన్‌ని క్రియారూపంలోకి తీసుకువచ్చే మనుషులని సేనాధిపతులనవచ్చు. ఈ సేనాధిపతుల కింద అనేక రకాల సైన్యం వుంటుంది. కాల్బలంవారు మనుషుల మధ్య తిరుగుతూ కక్కున పొడుస్తూంటే, అశ్వదళానికి చెందినవారు స్కూటర్లు, కార్లతో తిరుగుతూ పొడుస్తుంటారు. వైమానిక దళానికి చెందినవారు బొంబే, ఢిల్లీ లాంటి ఇతర చోట్ల నించి విమానాల్లో వచ్చి, ఏజిటేషన్ జరిగే ప్రదేశంలో కేవలం రెండు గంటలే వుండి తాము స్పెషలైజ్ చేసిన పనిని, అంటే మనిషి తక్షణం చచ్చేలా పొడవడం లేదా పెట్రోల్ బంక్‌లు తగలబెట్టడం చేసి మళ్ళీ ఫ్లయిట్ ఎక్కి వెళ్ళిపోవడం చేస్తూంటారు. మరికొందరు నిరాయుధంగా పోరాడుతారు. అంటే వారు లారీల్లో మనుషులని అనేక చోట్ల నించి ఏజిటేషన్ జరిగే చోటికి తరలిస్తుంటారు. మేధావులనే మరో రకం మనుషులు ఆ ఏజిటేషన్‌కి తగ్గ స్లోగన్స్, సింబల్స్ తయారు చేస్తారు. ఇలాంటివి పేపర్ చదివే వారికి కొన్ని గుర్తుకు రావచ్చు కాబట్టి ప్రత్యేకంగా వాటిని వుదహరించనక్కర్లేదు. అవి గుర్తుకు రాని వారికి కొన్ని వుదాహరణలు.

'జీతాలు పెంచు – లేదా గద్దె దిగు'
'శాంతి పుట్టి భ్రాంతి
దేశం నిండా వున్నది క్రాంతి'.

ఇలా సందర్భోచితంగా స్లోగన్స్‌ని అల్లి ప్రజల్లోకి విసిరేస్తారా మేధావులు. మరికొందరు కమాండర్స్ పోలీసులు ఏజిటేటర్స్ మీదకివస్తే రాళ్ళు రువ్వి, పోలీసులని ఎలా ఎదుర్కోవాలి అన్న విద్య గురించి సమస్తం తెలుసున్నవారు. వీళ్ల ఏజిటేషన్‌లో ముందు, వెనక వుండి తమ్మ బాధ్యతని తాము నెరవేరుస్తూంటారు.

అయితే వీటిలో పాల్గొనే ప్రజలు ఈ సైన్యంలో భాగం కారు. వాళ్లు వుద్యోగాలు, మరే యితర వ్యాపకాలు లేక, పనీపాటా, లేక విసుగుతో

విసుగుతో చచ్చిపోతూ సరదా కోసమో క్రైంపాస్ కోసమో ఎక్కడయినా యిళ్లు కాలితే బావుణ్ణు చూడచ్చు అనుకుంటూనో కాలం గడిపే సామాన్య ప్రజానీకం. రోడ్డుమీద గొడవ జరుగుతుంటే భార్యని హాస్పిటల్‌లో డెలివరీకి చేర్చాల్సి వున్నా కదలకుండా ఆగిపోయి ఆ గొడవ పూర్తయ్యే దాకా కదలని మనస్తత్వాలు గల వాళ్ళంతా ఈ గొడవల్లో పాల్గొంటారు. వంటరిగా వుండగా వీళ్ళంతా పిరికిపందలు కాని పదిమందితో కలిసి బస్సు తగలబెట్టాలన్నా, పోలీసుల మీద రాళ్లు రువ్వాలన్నా ముందుంటారు.

సైన్యంలోనివారు 'పెట్రోల్ ఎక్కడ?' అని అడిగితే చాలు. వీరు వీరావేశంగా ఓ కారాపి అందులోనించి పెట్రోల్ తీసి అగ్గిపెట్టెతో సహా యిస్తారు. వాళ్ళలో 'అయోధ్య ఏ స్టేట్‌లో వుంది?' అని అడిగితే సమాధానం నిల్. లేదా చుండూరులో ఎంతమంది దళితులు బాధితులయ్యారు, అది ఏ జిల్లాలో వుంది అని అడిగినా సమాధానం రాదు. మరిక్కడెందుకున్నావు అంటే "సరదాకి" అనో, లేదా "ఇరవై రూపాయలిచ్చారు కాబట్టి" అనో సమాధానం వస్తుంది.

**పద్ధతి** : బహిరంగ సభో లేదా కూడలిలో మీటింగ్‌లోనో ఈ కార్యక్రమం మొదలవుతుంది. మైక్ ముందు మహారాజు లేదా ప్రచార విభాగానికి చెందిన మనుషులు ఎంతో వుద్వేగంగా, వినేవారిలోని ఎమోషన్స్‌ని తట్టిలేపి వారిలో వుద్రేకం కలిగే విధంగా స్పీచ్ యిస్తారు. నీరు కాగి కాగి ఆ పాత్రమీద పెట్టిన మూత ఆవిరికి లేచి పడే విధంగా వీరు తమ స్పీచ్‌తో ప్రజానీకాన్ని నెమ్మదిగా వేడిచేసి ఆవేశాన్ని రెచ్చగొడతారు. ఆ డెమాన్‌స్ట్రేషన్‌ని ఆరంభించే సైన్యం ఆ ప్రజల మధ్య అక్కడక్కడ తమ తమ ప్లేస్‌లలో సిద్ధంగా వుండి మొదటి హింసాత్మక చర్యలని ఆరంభిస్తారు. పోలీసులు వచ్చి కల్పించుకుంటే అకస్మాత్తుగా వాళ్ళని సైపు గొట్టాలతో, కత్తులతో అటాక్ చేస్తారు డిమాన్‌స్ట్రేటర్స్. సామాన్య ప్రజలు వాటిని మనీ పర్సుల్లానో, కర్చీఫ్‌ల్లానో దగ్గరుంచుకుని తిరగరు. కేవలం సైనికుల దగ్గరే అవి వుంటాయి. వాళ్ళే ఆ మీటింగ్స్‌లో హాజరవుతారు.

అయితే యజ్ఞఫలం దీన్ని సృష్టించే వ్యక్తికి అవసరం. అందు

కోసం కొంతమంది అక్కడ మరణించి తీరాలి. పోలీసులు చంపకపోతే ఆ పని వాళ్ళ మనుషులే చేస్తారు.

పోలీస్ బ్రూటాలిటీస్ గురించి పత్రికలు మర్నాడు రాస్తాయి. అలా మరణించినవారి శవాలని వూరేగించి స్మశానవాటికి తీసుకెళ్ళి కాలుస్తారు. సామాన్య ప్రజల ప్రాణాలని కాపాడలేని ముఖ్యమంత్రి గద్దె దిగాలంటారు. పోలీసు రాజ్యం నశించాలి అంటారు. లేదా ఆ చట్టం, ఆ ప్రభుత్వ పాలసీ మారాలంటారు. రాష్ట్రంలో లేదా దేశంలో శాంతి భద్రతలు నశించాయంటారు.

ఫలితంగా ముఖ్యమంత్రి మారతాడు. లేదా రాజీనామా చేస్తాడు. మళ్ళీ ఎన్నికలొస్తాయి.

మళ్ళీ ఓ రోజు ఆఫీసుకి బయలుదేరుతుంటే బస్సులు రావు. కారణం ఏంటంటే 'బంద్'. శాంతి భద్రతలు కాపాడలేని ముఖ్యమంత్రి గద్దె దిగాలనిట అని తెలుస్తుంది. 'నిజమే కామోసు' అనుకునే వాళ్ళు వున్నంత కాలం మన దేశం ఈ రాజకీయ చరిత్ర మారదు.

# ఆల్ అబవుట్ గ్రాండ్‌మా

భర్తని భార్య, తల్లిని కూతురు, తండ్రిని కొడుకు, బావని మరదలు ప్రేమించడం సహజం. ఒక్కోసారి ద్వేషించడం కూడా సహజం అయిందీ రోజుల్లో. కానీ ప్రతి మనిషి ప్రేమించడమే తప్ప ద్వేషించడం జరగని ఓ రక్తసంబంధీక బంధువు వున్నది.

ఆవిడే గ్రాండ్ మదర్. గ్రాన్నీని మనవలు, మనవరాళ్ళు ప్రేమించడమే తప్ప ద్వేషించలేరు.

గ్రాండ్ మా అనే ఒకే పదం వుంది ఇంగ్లీషులో నాయనమ్మకి, అమ్మమ్మకి. పెటర్నల్ గ్రాండ్ మదర్ అంటే నానమ్మ. మెటర్నల్ గ్రాండ్ మదర్ అంటే అమ్మమ్మ. గ్రాండ్ మదర్‌ని ప్రేమగా గ్రాండ్‌మా